# ఎంపిక

పాలంకి సత్య

పది సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తూ నెలకు పన్నెండు వేల రూపాయల దాకా తెచ్చుకుంటున్న వ్యక్తికి అకస్మాత్తుగా తమ పని చేస్తున్న కంపెనీ మూతపడితే ఎదురయ్యే పరిస్థితి అనూహ్యమైనది. అటువంటి పరిస్థితే మురళీకృష్ణకు ఎదురైంది....

★★★

స్వాతంత్ర్య పోరాటం జరుపుతున్నపుడు గాంధీ మహాత్ముడు రామరాజ్యం గురించి కలలు కనేవారు. ఆయన కోరుకున్న రామ రాజ్యంలో కుటీర పరిశ్రమలకీ, చిన్న పరిశ్రమలకీ ప్రథమ స్థానముండేది. ప్రజలలో ఎక్కువమందికి జీవనోపాధిని పోగొట్టే యంత్రీకరణను ఆయన వ్యతిరేకించేవారు. ఎందరి త్యాగఫలంగా మనకు స్వతంత్రం లభించింది. లభించిన కొద్దికాలానికే గాంధీజీ మరణించారు. ఆయనతోపాటుగా ఆయన కన్నకలలూ మట్టిలో కలిసిపోయాయి. పెద్ద పరిశ్రమల ద్వారానే ప్రగతి సాధ్యమని దేశ నాయకులు నమ్మారు. పెద్ద పెద్ద పరిశ్రమలు స్థాపించారు. పూర్వం రాజులు పట్టపుటేనుగులను పోషించేవారట. ఒక్క ఏనుగు మేతతో పది సంసారాలు హాయిగా జీవించవచ్చును. అయినా ఏడాదికో, ఆరు నెలలకో ఒకసారి జరిగే ఉత్సవాలలో ఊరేగడానికి ఏనుగులను పెంచేవారు. రాజులు కనుక వారికి ఏం చేసినా చెల్లింది. ప్రభుత్వం స్థాపించిన పరిశ్రమలు పట్టపుటేనుగులను మించిపోయాయి. ప్రజాస్వామ్యంలో నష్టాలను భరిస్తూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వహించడం అసాధ్యమైపోయింది. ప్రభుత్వం వీలయినంతవరకూ పరిశ్రమలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేసింది. సాధ్యమైనంతవరకూ ఉద్యోగులకు ఇతర రంగాలలో జీవనోపాధి కల్పించింది. ఏ విధంగానూ అవకాశం లేని చోట పరిశ్రమలను మూసివేసింది. అప్పుడు చాలామంది వీధిన పడ్డారు. అటువంటి వారిలో ఒకడైన మురళీకృష్ణ భార్య రాధతో భవిష్యత్తు చర్చిస్తున్నాడు.

''ఎందరికో ఉద్యోగాలు పోయాయి. ఎన్నో సంసారాలు వీధిన పడ్డాయి. అందరిలో మనమూ ఉన్నామనుకోవాలి. బాధపడితే ఏం సాధిస్తాం''.

''అందరిలో మనమూ ఉన్నామనుకుంటే అన్నం వస్తుందా?'' అంది రాధ.

''అన్నమూ రాదు. పిల్లల స్కూలు ఫీజులూ రావు. ఇంట్లోకి నీళ్ళూ, కరంటూ రావు, వంటకి గ్యాసు రాదు...''

''ఆగండాగండి. మరి ఏమీ రాకపోతే ఎలా?'' రాధ గట్టిగా అంది.

''మెల్లిగా మాట్లాడు. పిల్లలు వింటే భయపడతారు. పక్క వాళ్ళు వింటే పరువు పోతుంది.''

''మరి ఏం చేద్దామో చెప్పండి.''

''అదృష్టం కొద్దీ పిత్రార్జితమైన ఇల్లుంది. పదేళ్ళలో కష్టపడి దాచుకున్న డబ్బు లక్ష రూపాయల దాకా ఉంది. ప్రస్తుతం ఆ డబ్బు వాడుకుందాం. నేను ఉద్యోగ ప్రయత్నాలు మొదలెడతాను. ఉద్యోగం వచ్చేదాకా కొంత జాగ్రత్త తప్పనిసరి''

''నేను ఏదైనా ఉద్యోగానికి ప్రయత్నించనా?''

మురళీకృష్ణ సన్నగా నవ్వాడు.

''ఇంటర్మీడియెట్‌కి ఉద్యోగాలొచ్చే రోజులా? ఏ చిన్న స్కూల్లోనో అయిదారు వందల రూపాయల టీచరుద్యోగం వస్తుందేమో''


''చిన్నప్పుడే చదువు మాన్పించి పెళ్ళి చేసేశారు. నేనే పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి ఏ గవర్నమెంటులోనో ఉద్యోగం తెచ్చుకుని ఉంటే ఈ కష్టం ఉండేది కాదు''

''అయితే గియితే అని అనుకోడంవల్ల లాభం ఏమిటి? నేను ఈ కంపెనీలో చేరకుండా ఉంటే బాగుండేది అనుకోవచ్చు. ప్రైవేటు కంపెనీలో చేరలేదు అనుకోవడం అవసరం. అప్పట్లో ప్రభుత్వ రంగ సంస్థల్లోనే జాబ్ గారంటీ ఉందనుకున్నాను. ఉద్యోగంలో చేరాను. ఇప్పుడిలా అవుతుందని కలలు కన్నానా? జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? హెచ్చుతగ్గులు ఎవరికీ తప్పవు. ఇంతేరా ఈ జీవితం, తిరిగే రంగుల రాట్నం'' చివరలో పాట పాడాడు మురళీకృష్ణ.

''ఇప్పుడు పాటలేమిట''ని విసుక్కుంది రాధ.

''స్ట్రెస్ రిలీఫింగ్‌కి సంగీతమే బెస్ట్ మెడిసిన్'' అన్నాడు మురళీకృష్ణ.

''అదిసరే కానీ రంగుల రాట్నం అడ్డంగా తిరుగుతుంది కదా. హెచ్చుతగ్గులని ఎలా సూచిస్తుంది'' అని అడిగింది రాధ.



''అక్కడే పొరపాటు పడ్డావు. ఇంగ్లీషు వాళ్ళకి ఉన్న సంపద మనకి లేదు. ఇంగ్లీషుకున్న భాషా సంపద తెలుగుకి లేదు. ఇంగ్లీషులో భూమికి సమాంతరంగా తిరిగేదాన్ని మెర్రీ-గో-రౌండ్ అంటారు. పైనుంచి కిందకీ, కిందనుంచీ పైకీ గుండ్రంగా తిరిగేదాన్ని జెయింట్‌వీల్ అంటారు. తెలుగులో రెండింటికీ రంగుల రాట్నమనే పేరు. పాటలో చెప్పిన రంగులరాట్నం జెయింట్ వీల్ కానీ నువ్వనుకున్న మెర్రీగోరౌండ్ కాదు.''

వేదాంతోపన్యాసం చేస్తున్న భంగిమలో కూర్చుని చెప్పాడు మురళీకృష్ణ. శిష్యురాలిలా కూచుని వింటూ ''ఓహో'' అంది రాధ.

ఇద్దరూ నవ్వుకున్నారు. వారి నవ్వులు జోలపాటలై పిల్లలను గాఢనిద్రలోకి పంపించాయి.

★★★

బాంకునుంచి వచ్చిన స్టేట్‌మెంట్స్ చూస్తున్నాడు శివశంకర్. క్రెడిట్ కార్డులు వచ్చాక కొనుగోలుదార్ల పని చాలా సులభమైపోయింది. చేతిలో డబ్బుందా లేదా అన్న ఆలోచన అక్కరలేదు. ఈ వస్తువు మనం కొనగలమా లేదా అన్న భయం లేదు. ఇంక కొనాల్సిన అవసరం ఉందా లేదా అన్న ఆలోచన కూడా లేకపోతే ఏ బెంగా లేదు.

''మంజరీ క్లాత్ స్టోర్స్‌కి నాలుగు వేలు పే చేసినట్లుగా ఉందేమిటి?'' అడిగాడు శివశంకర్ భార్యను.

భవాని నిర్లక్ష్యంగా కాళ్ళూపుతూ ''దీపావళికి చీర కొనుక్కున్నాను'' అంది.

''అదేమిటి దసరాకేగా కొనుక్కున్నావు. మళ్ళీ దీపావళికి ఎందుకు?''

''అనకండనకండి. పండక్కి చీర కొనుక్కోడం మహాపాపమా?''

''అలా అని నేనన్నానా? నాతో చెప్పి కొనుక్కోవచ్చుగా?''

''అంత అనుమానముంటే సింగిల్ క్రెడిట్ కార్డు తీసుకోలేకపోయారా? నా పేరున కూడా ఎందుకు తీసుకున్నట్లు?''

శివశంకర్‌కి చిరాగ్గా అన్పించింది. ''నీలాంటి ఆడవాళ్ళని చూసే జాయింట్ అకౌంట్‌కి డెఫినిషన్ ఇచ్చారు. జాయింట్ అకౌంట్ అంటే ఒకళ్ళు డబ్బు వేసేవాళ్ళూ, ఒకళ్ళు డబ్బు తీసే వాళ్ళూ అని అర్థంట.''

''ఎవడో మీలాంటి మగమహారాజే అని ఉంటాడు. ముష్టి నాలుగువేలరూపాయల చీరకింత రాద్ధాంతమా? పెద్ద ఆఫీసరని చెప్పి పెళ్ళి చేసి నా గొంతు కోశారు. నేనేమైనా టిష్యూ చీర కొనుక్కున్నానా?''

శివశంకర్‌లో కోపం ఆకాశాన్నంటింది.

''ముష్టి నాలుగు వేలరూపాయలా? సంపాదించే వాడికి తెలుస్తుంది కష్టం. ఇంట్లో హాయిగా కూచునేదానివి నీకేం తెలుస్తుంది. చీరలు కొనుక్కోడం, సింగారించుకు తిరగడం తప్ప''

భవాని గట్టిగా అరిచింది. ''ఈ మాట ఎప్పుడో అప్పుడు అంటారని ఎదురుచూస్తూనే ఉన్నాను. అందుకే ఆడవాళ్ళు కూడా మగాళ్ళతో సమంగా ఉద్యోగాలు చేసి సంపాదించాలని ఫెమినిస్టులు చెప్తున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడంవల్ల అనర్థాలన్నీ నాకు ఇప్పుడు తెలిసి వస్తున్నాయి. ఇంక చస్తే మీ డబ్బుతో చీరలు కొనుక్కోను. నేనూ పోస్టుగ్రాడ్యుయేట్‌నే. ప్రయత్నిస్తే ఉద్యోగమే దొరకదా?''

శివశంకర్ విసురుగా బయటకు వెళ్ళిపోయాడు. భవాని కైనెటిక్ హోండా తీసుకుని తన కష్టం ఫ్రెండ్స్‌కి చెప్పుకునేందుకు బయల్దేరింది.

★★★

రెండు నెలల తర్వాత ఒక పెద్ద కంపెనీలో అకౌంట్స్ ఆఫీసర్

ఉద్యోగానికి ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. హాజరయిన అభ్యర్థులలో మురళీకృష్ణ, భవాని ఉన్నారు.

సబ్జెక్టుమీద అడిగిన ప్రశ్నలకు మురళీకృష్ణ సంతృప్తికరంగా జవాబులు ఇచ్చాడు. ఇంక ఇంటర్వ్యూ అయిపోయిందని అతననుకుంటూ ఉండగా కంపెనీ ఛైర్మన్ జగన్మోహన్‌రావుగారు ''మీరు ఎంత శాలరీ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు'' అడిగారు.

మురళీకృష్ణ తబ్బిబ్బయ్యాడు. ఊహించిన ప్రశ్నే అయినా జవాబు తెలియని ప్రశ్న అది. ఇదివరకు చేసిన ఉద్యోగంలో గ్రాస్ శాలరీ పన్నెండు వేల దాకా ఉండేది. కట్స్‌పోనూ చేతికి పదివేల దాకా వచ్చేది. పిల్లలని మంచి స్కూళ్ళో చదివిస్తున్నాడు. రాను రానూ వాళ్ళ చదువు మీద ఖర్చు పెరుగుతుందే కానీ తరగదు. వయసు పెరిగిన కొద్దీ వైద్యం మీద కూడా ఖర్చు పెట్టాలి. పెన్షన్ లేని ఉద్యోగం. ధరలా పెరుగుతున్నాయి.

దివరకటి జీతమే అడిగితే... ఇంటర్వ్యూకి చాలామంది వచ్చారు. మరీ ఎక్కువ అడుగుతున్నానని ఉద్యోగమివ్వరేమో... బాగా తక్కువ అడిగితే సంసారం గడవడమెలా?

ఎక్కువ సేపు ఆలోచిస్తే పుణ్యకాలం దాటిపోతుందనుకున్న మురళీకృష్ణ 'పదివేల రూపాయలు సర్' అన్నాడు.

''మంచిది. యూకెన్ గో. మేం త్వరలో మీకు మా నిర్ణయం చెప్తాం''

''థ్యాంక్యూసర్''

★★★

భవాని హుషారుగా ఇంటర్వ్యూ గదిలో అడుగుపెట్టింది. అన్ని ప్రశ్నలకూ తోచిన సమాధానాలు చెప్పింది.

ఛెయిర్‌మన్ ''ఎంత శాలరీ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు'' అని అడిగారు.

ఎంకాం చదివిన భవాని మనస్సులో అకౌంట్స్ వేసుకుంది. స్కూటర్ పెట్రోల్‌కి వెయ్యి రూపాయలవచ్చు. చిన్న చిన్న ఖర్చులు ఇంకో వెయ్యి ఉండొచ్చు. నాలుగు వేలు పెట్టి చీరలు హాయిగా కొనుక్కోవచ్చు. ఇంక భర్త నుంచి పైసా తనకి అక్కర్లేదు.

''సిక్స్ థౌజండ్ సర్''

''వెరీ గుడ్. యూకెన్ గో. వియ్ విల్ లెట్ యూనో''

''థ్యాంక్యూసర్''

★★★

రోజులు గడుస్తున్నాయి.

''మీరు ఆమధ్య ఒక కంపెనీ ఇంటర్వ్యూకి అటెండ్ అయ్యారు కదా. దాని రిజల్ట్ ఏమైందో'' అంది రాధ.

''మనకున్న తొందర వాళ్ళకి ఉంటుందా? ఉద్యోగంలో ఖాళీ ఏర్పడిన రోజే ప్రకటన వేసి, మర్నాడే ఇంటర్వ్యూ చేసి, మూడో రోజున ఉద్యోగాలివ్వరు'' అన్నాడు మురళీకృష్ణ.

పైకి అలా అన్నాడే కానీ మనస్సులో అతనికి బెంగగా ఉంది. తను జీతం మరీ ఎక్కువ అడిగాడేమోనన్న భయం అతన్ని ఇంటర్వ్యూ రోజునుంచీ పీడిస్తున్నది. ఇంకెవరైనా తక్కువ అడిగితే, వాళ్ళకి ఉద్యోగం ఇచ్చేశారేమో. ఈ ఉద్యోగం రాకపోతే ఏం చెయ్యాలి. చదువూ, ఎక్స్‌పీరియన్స్ ఎక్కువున్నాయని చాలా కంపెనీల వాళ్ళు తనని ఇంటర్వ్యూలకే పిలవడం లేదు. అప్పటికే ఎక్కడైనా లెక్చరరు పోస్టు దొరికినా బావుండునని ప్రయత్నించాడు. ఇంటర్మీడియెట్‌లో మగ పిల్లలు అందరూ ఇంజనీర్లో, డాక్టర్లో అయిపోవాలని మాథ్స్, సైన్స్ గ్రూపులకే మొగ్గు చూపిస్తున్నారు. కామర్స్ చెప్పే జూనియర్ కాలేజీలు చాలా తక్కువ ఉన్నాయి. డిగ్రీ కాలేజీకి డాక్టరేటు సిద్ధంగా ఉన్నారు. తనకి ఉద్యోగం రాకపోతే ఏం చెయ్యాలి? తనూ రాధా ఇద్దరూ ఓ చిన్న స్కూళ్ళలోనో టీచర్లుగా చేరి, సాయంత్రాలు ట్యూషన్లు చెప్పి, రాత్రిళ్ళు తను ఎక్కడైనా పార్ట్‌టైం అకౌంట్స్ రాస్తే ఇల్లు గడుస్తుందేమో...

ఏమో ఉద్యోగం వస్తుందేమో. ఎందుకింత భయం.

మురళీకృష్ణ మనస్సు ఆశా నిరాశలమధ్య ఊగులాడింది.

★★★

అభ్యర్థి ఎంపిక కోసం ఇంటర్వ్యూ బోర్డు సమావేశమైంది.

జగన్మోహన్‌రావుగారు బోర్డులోని మిగిలిన ఇద్దరు మెంబర్లనీ అభిప్రాయాలడిగారు.

''మురళీకృష్ణ అన్ని ప్రశ్నలకూ సరైన సమాధానలిచ్చాడు. అతనికి ఎక్స్‌పీరియన్స్ కూడా ఉంది. అతనైతే బాగుండునని అనుకుంటున్నాను సర్'' అన్నాడు పర్సనల్ మేనేజర్.

''అతని శాలరీ ఎక్స్‌పెక్టేషన్ మరీ ఎక్కువగా ఉంది''

ఛెయిర్‌మెన్‌గారి కొడుకూ, కంపెనీ మేనేజింగ్ డైరెక్టరూ అయిన రెండో మెంబరు మాట్లాడాడు.

''అతను మెరిట్ ఉన్నవాడుకదా. ఆ మాత్రం ఎక్స్‌పెక్ట్ చెయ్యకుండా ఎలా ఉంటాడు? వస్తువు మంచిదైతే ధర ఎక్కువ ఉండదా?''

''మనకంత మంచి వస్తువు అవసరమా?'' గుంభనంగా నవ్వారు జగన్మోహనరావుగారు.

''అంటే...'' అని అడిగాడు మేనేజింగ్ డైరెక్టర్.

జగన్మోహనరావుగారు ఆ ప్రశ్నకు జవాబివ్వకుండా ''కాండిడేట్సు అందరిలోకి భవానిని సెలెక్టు చెయ్యడం మంచిది'' అన్నాడు.

''ఆవిడకు ఎక్స్‌పీరియన్స్ లేదు. కొన్ని జవాబులు తప్పు చేసింది''

''నష్టమేమిటి? షాపుకెళ్ళి వస్తువులు కొన్నప్పుడు నాణ్యత మాత్రమే చూస్తామా? మనకి ఏ ధరలో వస్తువు కావాలి అని కూడా ఆలోచిస్తాం. మనకిప్పుడు అకౌంట్స్ ఆఫీసరు కావాలి. ఇంటర్వ్యూలో కొన్ని జవాబులు తెలియనంతలో అసలు పని చెయ్యడం రాదని ఎలా చెప్తాం? మెరిట్ ఒక్కటే చాలదు. మన దగ్గర ఉద్యోగంలో చేరిన వాళ్ళు కంపెనీని నమ్ముకుని ఎన్నాళ్ళు పని చేస్తారు, మనమిచ్చే జీతంతో తృప్తిపడతారా అని ఆలోచించాలి. మురళీకృష్ణ పన్నెండువేలు ఇదివరలో తెచ్చుకుంటూ ఇప్పుడు పదివేలు అడిగాడు. అతను దానితో తృప్తిపడతాడా? అతనికి సంసారం పోషించాల్సిన బాధ్యత ఉంది. భవానికి ఆ బాధ్యత లేదు. ఆవిడకి సొంత సరదాలకి జీతమొస్తే చాలు. నేనూ సంపాదిస్తున్నానన్న ఊహ చాలు. అలాంటి వాళ్ళు తక్కువ జీతానికే సంతోషంగా పని చేస్తారు.''

బోర్డు మెంబర్లిద్దరూ ఆసక్తిగా వింటున్నారు.

''అసలు ఈ స్త్రీ స్వాతంత్ర్యోద్యమాలు ఎవరు మొదలెట్టారో తెలుసున్నా స్త్రీలు తామే ప్రారంభించామనుకుంటారు. ఈ ఉద్యమాల వెనుకనున్న హస్తం మన వ్యాపారవేత్తలదే. ఆడవాళ్ళకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటే వాళ్ళకి నచ్చే బట్టలూ, విలాస వస్తువులూ, వంటింటి సామాన్లూ, సౌందర్య సాధనాలూ మనం హాయిగా సులభంగా అమ్ముకోవచ్చును. స్త్రీలు కూడా ఉద్యోగాలికి ఎగబెడితే లేబర్ మార్కెట్‌లో సప్లై పెరుగుతుంది. అప్పుడు మనకి తక్కువ జీతాలకే మనుషులు దొరుకుతారు.

''డాడీ'' ఆశ్చర్యంగా అన్నాడు మేనేజింగ్ డైరెక్టర్.

''ఈ ప్రాక్టికల్ టిప్ నేర్చుకో మైబాయ్. ఈపని నేను ఒక్కణ్ణే చెయ్యడం లేదు. మగ పిల్లల స్కూళ్లలో కూడా లేడీ టీచర్స్ ఎక్కువ. మగ టీచర్లు దొరకరనా? తక్కువ ధరకి వస్తువులు కొనాలి. అఫ్‌కోర్స్ మినిమమ్ నాణ్యత ఉండాలనుకో. అందుకే భవానిని సెలెక్టు చెయ్యడం మంచిది.''

అర్థమైనట్లుగా తల ఊపారు బోర్డు మెంబర్లిద్దరూ.

★★★

''ఏమిటి కొత్త చీర కట్టుకున్నట్లున్నావు'' అన్నాడు శివశంకర్.

''మా అమ్మ కొని పెట్టింది. మీ డబ్బుతో చీరలు కొనుక్కోనని సవాలు చేశాను. ఇంతవరకూ కొనుక్కోలేదు'' అంది భవాని.

''ఏదో ఏళ్ళ తరబడి కొనుక్కోనట్లు మాట్లాడుతున్నావే'' అన్నాడు శివశంకర్.

భవాని జవాబు చెప్పేలోగా పోస్టు వచ్చింది. తనకి వచ్చిన ఉత్తరం చూసుకున్న ఆమె '' ఇదిగో నా మాట నిలబెట్టుకున్నాను. నెలకి ఆరు వేల రూపాయల ఉద్యోగం వచ్చింది'' అంది.

పైకి ముఖం చిట్లించినా శివశంకర్ మనస్సులో ఆనందంగా ఉన్నాడు.

నాలుగు చోట్లకి ఊరికేనా తిరిగి డబ్బు తగలపెట్టడం కన్నా ఏదో ఒక చోటికి వెళ్ళి ఎంతో కొంత సంపాదిస్తే నయమని అతననుకున్నాడు.

ఏడాది గడిచింది. భవాని ఆనందంగా ఫ్రెండ్స్‌కి పార్టీ ఇచ్చింది.

ఎక్కువ మంది మహిళలకి ఉద్యోగాలిచ్చి మహిళాభ్యుదయానికి కృషి చేస్తున్నందుకు జగన్మోహనరావుగారికి సన్మానం జరిగింది.

సన్మానవార్తను పేపర్లో చదివిన మురళీకృష్ణ పెదవుల మీద విషాదం కూడిన చిరునవ్వు కదలాడింది.

''ఒకరి బతుకులో చీకటిరేయి, ఇరువురి బతుకుల వెన్నెల హాయి,

ఇంతేరా ఈ జీవితం, తిరిగే రంగుల రాదతని మనస్సు.

